## 25శాతం ఆహార పదార్థాల్లో కల్తీ: ఎఫ్ఎస్ఎస్ఏఐ

**నమూనాలు, ఫలితాల వివరాలు...**

| సంవత్సరం | నమూనాలు | కల్తీల గుర్తింపు |
|---|---|---|
| 2020-21 | 1,07,829 | 28,347(26.28శాతం) |
| 2021-22 | 1,44,345 | 32,934(22.81శాతం) |
| 2022-23 | 1,77,511 | 44,626(25.14శాతం) |
| 2023-24 | 4,51,296 | డేటా సేకరణ జరుగుతున్నది |

హైదరాబాద్, ఏప్రిల్ 29 (నమస్తే తెలంగాణ): దేశంలో విక్రయిస్తున్న ఆహార పదార్థాల్లో సగటున 25శాతం వరకు కల్తీ జరుగుతున్నట్టు గుర్తించామని భారత ఆహార భద్రత, ప్రమాణాల అథారిటీ (ఎఫ్ఎస్ఎస్ఏఐ) వెల్లడించింది. పాలు, వంట నూనెలు, మసాలాలు, టీ పొడి, పప్పులు, ఫోర్టిఫైడ్ రైస్ తదితర పదార్థాలకు సంబంధించి గత నాలుగేండ్లలో సేకరించి విశ్లేషించిన వివిధ ఆహార పదార్థాల నాణ్యతా ఫలితాలను ఎఫ్ఎస్ఎస్ఏఐ సోమవారం విడుదల చేసింది. నమూనాలను విశ్లేషించేందుకు 239ప్రయోగశాలలు, 261 మొబైల్ ల్యాబ్‌లు వినియోగించినట్టు తెలిపింది.

## బస్‌భవన్ పక్కనున్నవి స్క్రాప్ బస్సులే: టీఎస్ఆర్టీసీ

హైదరాబాద్, ఏప్రిల్ 29 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్ బస్‌భవన్ పక్కన ఖాళీ స్థలంలో ఉన్నవన్నీ స్క్రాప్ బస్సులేనని టీఎస్ఆర్టీసీ వెల్లడించింది. అవి రెగ్యులర్ బస్సులనే విధంగా ఎండకు ఎండుతూ, వానకు తడుస్తూ తుప్పు పడతున్నాయంటూ కొన్ని పత్రికల్లో వచ్చిన కథనాల్లో వాస్తవం లేదని పేర్కొన్నది. కాలం చెల్లిన బస్సులనే ఖాళీ స్థలంలో పార్కింగ్ చేస్తున్నట్టు తెలిపింది. ఈ ఏడాది మార్చిలో 262 బస్సులకు సంస్థ వేలం నిర్వహించగా, 180 బస్సులు అమ్ముడుపోయాయని, మిగతా వాటిని అక్కడే నిలిపి ఉంచినట్టు తెలిపింది. నాగర్ కర్నూలు జిల్లా లింగాల మండలం మాడాపూర్, కోమటికుంట స్టేజీల వద్ద ఆర్టీసీ బస్సులను ఆపలేదంటూ ప్రచురించిన కథనంలో కూడా వాస్తవం లేదని టీఎస్ఆర్టీసీ పేర్కొన్నది. పల్లెవెలుగు సర్వీసులకు మాత్రమే ఆయా స్టేజీల్లో స్టాప్ ఉందని, ప్రయాణికులు ఉంటే ఎక్స్‌ప్రెస్ సర్వీసులనూ ఆపాలని సిబ్బందికి ఆదేశాలు ఇచ్చినట్టు ఉన్నతాధికారులు తెలిపారు.

# ఇంజినీరింగ్‌కు అబ్బాయిలు.. అగ్రికల్చర్‌కు అమ్మాయిలు సై

- మే 7 నుంచి 11వరకు ఎప్‌సెట్
- మే నెలాఖరులో ఫలితాల వెల్లడి



హైదరాబాద్, ఏప్రిల్ 29 (నమస్తే తెలంగాణ ): అగ్రికల్చర్, ఫార్మసీ, బీఎస్సీ నర్సింగ్ వంటి కోర్సులవైపే అమ్మాయిలు ఆకర్షితులవుతున్నారు. అబ్బాయిలు ఇంజినీరింగ్ అంటే ఇష్టపడుతున్నారు. ఈ ఏడాది ఎప్‌సెట్‌కు వచ్చిన దరఖాస్తులను పరిశీలిస్తే ఇదే అవగతమవుతున్నది. ఈసారి ఇంజినీరింగ్‌కు అబ్బాయిలు 1,50,600 (60శాతం) మంది దరఖాస్తు చేస్తే, అమ్మాయిలు కేవలం 1,03,862 (40శాతం) మంది దరఖాస్తు చేశారు. అదే అగ్రికల్చర్ అండ్ ఫార్మసీకి అమ్మాయిలు 73,224 (73శాతం) మంది దరఖాస్తులు సమర్పిస్తే, అబ్బాయిలు కేవలం 27,003 (27శాతం) మంది మాత్రమే దరఖాస్తు చేశారు. సోమవారం కూకట్‌పల్లి జేఎన్టీయూలో మే 7 నుంచి 11 వరకు జరగనున్న పరీక్షకు సంబంధించిన ఏర్పాట్లపై అధికారులు వివరాలు వెల్లడించారు.

### నిరుటి కంటే పెరిగిన దరఖాస్తులు

నిరుటితో పోల్చితే ఈ ఏడాది ఇంజినీరింగ్‌కు దరఖాస్తులు పెరగగా, అగ్రికల్చర్ ఫార్మసీ విభాగానికి తగ్గాయి. ఈఏడాది ఇంజినీరింగ్‌కు 50వేలకు పైగా దరఖాస్తులొచ్చాయి. ఈసారి ఎప్‌సెట్- 2024 పరీక్షకు 3.54 లక్షల మందికిపైగా విద్యార్థులు రిజిస్ట్రేషన్ చేసుకున్నట్టు రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ లింబాద్రి వెల్లడించారు. అగ్రికల్చర్ అండ్ మెడికల్ హాల్‌టికెట్ల డౌన్‌లోడింగ్ సోమవారం నుంచే ప్రారంభమైందన్నారు. ఇక ఇంజినీరింగ్ హాల్‌టికెట్లను మే 1 నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చని సూచించారు. ఫలితాలను మే నెలాఖరులో విడుదల చేయనున్నట్టు తెలిపారు. ఎప్‌సెట్ పరీక్షల్లో తొలిసారిగా ఫేషియల్ రికగ్నిషన్ సాఫ్ట్‌వేర్‌ను వినియోగించాలని నిర్ణయించినట్టు పేర్కొన్నారు. సమావేశంలో ఉన్నత విద్యామండలి కార్యదర్శి ప్రొఫెసర్ శ్రీరాం వెంకటేశ్, జేఎన్టీయూ వీసీ ప్రొఫెసర్ కట్టా నర్సింహారెడ్డి, రిజిస్ట్రార్ కే వెంకటేశ్వర్‌రావు, ఎప్‌సెట్ కన్వీనర్ ప్రొఫెసర్ డీన్‌కుమార్, కో కన్వీనర్ ప్రొఫెసర్ విజయ్‌కుమార్‌రెడ్డి, ప్రొఫెసర్ తారాకళ్యాణి, ప్రొఫెసర్ రవీంద్రారెడ్డి, ప్రొఫెసర్ అరుణకుమారి పాల్గొన్నారు.

**ఎప్‌సెట్ దరఖాస్తులు**

| విభాగం | రాష్ట్రం | 2023 | 2024 |
|---|---|---|---|
| ఇంజినీరింగ్ | ఏపీ | 51,461 | 49,071 |
| ఇంజినీరింగ్ | తెలంగాణ | 1,53,890 | 2,05,472 |
| అగ్రి, ఫార్మసీ | ఏపీ | 20,743 | 12,349 |
| అగ్రి, ఫార్మసీ | తెలంగాణ | 94,589 | 87,911 |

### యూజీసీ నెట్ జూన్ 18కి వాయిదా

యూజీసీ నెట్ పరీక్షలపై సివిల్స్ ప్రిలిమ్స్ పరీక్ష ఎఫెక్ట్ పడింది. సివిల్స్ ప్రిలిమినరీ పరీక్ష నేపథ్యంలో 16న జరగాల్సిన నెట్ పరీక్షను జూన్ 18కి వాయిదా వేసినట్లు యూజీసీ చైర్మన్ ప్రొఫెసర్ మామిడాల జగదీశ్‌కుమార్ వెల్లడించారు. అభ్యర్థుల కోరిక మేరకు పరీక్షను వాయిదావేశామన్నారు.

















